నేడు ప్రొద్దుటూరులో చంద్రబాబు సభ

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రొద్దుటూరు పట్టణంలో శనివారం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు. టిడిపి జిల్లా నాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాగళం సభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నెల్లూరు జిల్లా వింజమూరు నుంచి హెలీకాప్టర్‌లో ప్రొద్దు టూరుకు చేరుకుంటారు. అనంతరం పుట్టపర్తి సర్కిల్‌లో జరిగే సభలో ప్రజల నుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటకు వెళ్లనున్నారు. ముందుగా నిర్ణయించిన మేరకు మైదుకూరు సభలోనూ చంద్రబాబు పాల్గొనాల్సి ఉంది. రోజుకు నాలుగు సభల్లో పాల్గొనడం ఇబ్బందిగా ఉన్నట్లుగా భావించి మూడింటికి కుదింపుతో మైదుకూరు సభను వాయిదా వేశారు.



టిడిపి అభ్యర్థులు వీరే

కడప ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి
రాజంపేట అసెంబ్లీ బరిలో 'సుగవాసి'

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు పెండింగ్ టికెట్లను టిడిపి ప్రకటించింది. శుక్రవారం కడప పార్లమెంట్, రాజంపేట అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. మూడు విడతలుగా జిల్లాలోని రాజంపేట పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. మిగిలిన ఐదు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో నాలుగింట్లో ఒకటి జనసేన, మూడు స్థానాలను బిజెపికి కేటాయించింది. తాజా విడతలో కడప పార్లమెంట్, రాజంపేట అసెంబ్లీ స్థానాలకు ఊహించని అభ్యర్థులను ఎంపిక చేసింది. ఎటువంటి రాజకీయ అనుభవం లేని యువకుడిని పార్లమెంట్‌కు, అనుభవం కలిగిన నాయకుడిని బిజెపి చాటున అసెంబ్లీ బరిలో పోటీకి నిలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలోని వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ధీటైన అభ్యర్థులను ఎంపిక చేయడంలో టిడిపి తడబాటు పడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కడప పార్లమెంట్ బరిలో జమ్మలమడుగుకు చెందిన చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా రాయచోటికి చెందిన సుగవాసి సుబ్రహ్మణ్యం పేర్లను ప్రకటించడం గమనార్హం. కడప పార్లమెంట్ స్థానానికి వైసిపి తరుపున సిట్టింగ్ ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి పోటీ చేయనున్న సంగతి తెలిసిందే. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు గత ఐదేళ్లుగా వైఎస్.అవినాష్‌రెడ్డిపైనే విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టిన సంగతి తెలిసిందే. ఇటువంటి నాయకునికి ధీటుగా సమర్థుడైన సీనియర్ నాయకుడిని ఎంపిక చేయడంలో చేతులెత్తేసింది. జమ్మలమడుగు అసెంబ్లీ అభ్యర్థిత్వానికి చివరి వరకు పోటీపడిన చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేరును పార్లమెంట్ స్థానానికి అభ్యర్థిగా ప్రకటించారు. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిని పార్లమెంట్ బరిలో నిలపకుండా, అసెంబ్లీ ముఖమే ఎరగని, యువకుడిని పార్లమెంట్ బరిలో నిలపడమేమిటో, ఏ పాటి సర్వేలపై ఆధారపడి ఎంపిక చేశారో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది.

కడప ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి



రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రహ్మణ్యం

రాజంపేట అసెంబ్లీ స్థానానికి సుగవాసి సుబ్రమణ్యం పేరును ప్రకటించారు. రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా బత్యాల చెంగల్రాయుడు, జగన్మోహన్‌రాజు పేర్లు హోరాహోరీగా పోటీ పడిన సంగతి తెలిసిందే. పారిశ్రామిక వేత్త గంటా నరహరి పేరు సైతం చక్కర్లు కొట్టింది. ఇటువంటి ఆర్థిక, అంగ, అనుచర బలం కలిగిన ప్రత్యర్థులను కాదని రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారం సాగిన అభ్యర్థి పేరును అసెంబ్లీ బరిలో నిలిపారు. వైసిపి రాజంపేట అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని బరిలో నిలిపింది. ఈయనకు దీటైన అభ్యర్థిగా బత్యాల చెంగల్రాయుడు నియోజకవర్గ వ్యాప్తంగా గుర్తింపు, కేడర్ ఆదరణ కలిగి ఉన్నారు. ఇటువంటి అభ్యర్థిని బరిలో నిలిపి ఉంటే టిడిపి గెలిచే అవకాశాలు ఉన్నాయనే అంచనాలు ఉన్నాయి. ఇటువంటి అభ్యర్థిత్వాన్ని ఎంపిక చేయకుండా టిడిపి గెలుపు అవకాశాలను తల్లకిందులు చేయడం చర్చనీ యాంశంగా మారింది.

భగ్గుమన్న అసమ్మతి సెగలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి అసెంబ్లీ అభ్యర్థి ఆశావహుల నిరీక్షణకు శుక్రవారం తెరపడింది. సీనియర్ నాయకులు పాలకొండ రాయుడు తనయుడు సుగవాసి సుబ్రహ్మణ్యంను టిడిపి రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా అధిష్టానం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. టిడిపి టికెట్ ఆశిస్తూ ఎంతో మంది ఆశావాకులకు నిరాశే మిగిలింది. రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగలరాయుడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాక్షేత్రంలో పర్యటిస్తూ ప్రజాభిమానానికి చేరువవుతూ పార్టీ భావజాలాన్ని, అధికార పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. వారిని కాదని సుగవాసి సుబ్రహ్మణ్యంకు టికెట్ కేటాయించడంతో రాజంపేట టిడిపి శ్రేణులలో ఒక్కసారిగా అసంతృప్తితో కూడిన నిరసనలు భగ్గుమన్నాయి. టిడిపికి చెందిన కరపత్రాలను పట్టణంలో బత్యాల అనుచరులు దహనం చేశారు.

టిడిపి కరపత్రాలను దహనం చేస్తున్న బత్యాల అనుచరులు

'బత్యాల'కు టికెట్ ఇవ్వకుంటే రాజీనామాలు : అద్దేపల్లి

నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడుకు టికెట్ ఇవ్వకుంటే రాజీనామాలు చేస్తామని టిడిపి అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు అన్నారు. శుక్రవారం తాళ్లపాకలోని స్వగృంలో విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికలలో ఓటమిపాలైనప్పటికీ బత్యాల నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌ను బలపరుస్తూ కష్ట సమయాలలో కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని ముందుకు నడిపించారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిని కాదని స్థానికేతరుడైన సుగవాసికి టికెట్ కేటాయించడం వలన రానున్న ఎన్నికలలో టిడిపి ఓటమి తధ్యమని, ఎన్నికలలో ఏజెంట్లను కూడా నియమించుకోలేని పరిస్థితి టిడిపికి రానున్నదని తెలిపారు. అధిష్టానం పునరాలోచించుకుని బత్యాలకు టికెట్ కేటాయించాలని, లేనిపక్షంలో రాజీనామాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు బత్యాలకు టికెట్ కేటాయించాలని కోరుతూ బత్యాల భవన్ మేడ పైకి ఎక్కి నిరసన తెలిపారు.

చేనేత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

బాధ్యులను కఠినంగా శిక్షించాలి
వృత్తి సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వృత్తి సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య అన్నారు. శుక్రవారం ఒంటిమిట్ట మండలం మాధవరంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పాల సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఒక్కొక్కరికి రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. 3.10 ఎకరాల భూమి వారి కుటుంబానికి చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుబ్బారావు పెద్ద కుమార్తె పాల లక్ష్మీప్రసన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే విధంగా ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత వృత్తినే అగాధంలోకి తోసేశారన్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఇన్సూరెన్స్‌లు రద్దు చేయడం గాని, నూలుపైన 19 శాతం, పట్టుపైన ఐదు శాతం జిఎస్‌టి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పించకపోగా సంక్షేమంలో భాగమైన చేనేత కార్మికులకు ఇచ్చే రాయితీలు కూడా కోత పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశాలే చేనేత కార్మికుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఉందని విమర్శించారు.

సుబ్బారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భాస్కరయ్య

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ మాట్లాడుతూ చేనేతకు గతంలో చట్టం చేసిన 11 రకాల బట్టలకు పవర్‌లూమ్ నుంచి మినహాయించి హ్యాండూమ్‌కే హక్కుగా ఉంచాలని జగనన్న నేతన్న నేస్తం చేనేత కుటుంబాల అందరికీ షరతులు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు వర్క్ ఫ్రం షెడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్ పార్కులో అభివృద్ధిపరిచి ఉపయోగంలోకి తీసుకు రావాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న సుబ్బారావు కుటుంబానికి కలెక్టర్ అధ్యక్షతన న్యాయ విచారణ జరిపి ఆత్మహత్యకు ముందు సుబ్బారావు రాసిన లేఖని మరణ వాంగ్మూలంగా స్వీకరించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.నర్సయ్య, సహాయ కార్యదర్శి సురేష్‌బాబు, సాంబయ్య పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-సుండుపల్లె

ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్‌పి బి.కృష్ణారావు అన్నారు. శుక్రవారం రాత్రి సుండుపల్లి, రాయవరం, తిమ్మసముద్రం గ్రామాల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిర్భయంగా, భయపక్షపాతాలు లేకుండా ఉండేందుకు పోలీసులు అనునిత్యం అండగా ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావద్దని తెలిపారు. ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసు వారిదేనని చెప్పారు. నిర్భయంగా ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియో గించుకోవాలన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్‌పి మహబూబ్ బాషా, రాయచోటి రూరల్ సిఐ తులసిరామ్, టి.సుండుపల్లి ఎస్ఐ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

కౌన్సిలర్ ఆసీఫ్ అలీఖాన్‌కు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

వైసిపి 30వ వార్డు కౌన్సిలర్ ఆసీఫ్ అలీఖాన్ అంత్యక్రియలు శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధువుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు. అంతిమయాత్ర పట్టణంలోని వారి నివాసం నుంచి బంగ్లా సమీపంలో ఉన్న దారుల్ వులుమ్ మదరస నుంచి పెంట మసీదు వరకు సాగింది. శ్రీకాంత్‌రెడ్డి పాడె మోసారు. ఆసీఫ్ అలీఖాన్ మృతి బాధాకరమని, వైసిపికి తీరని లోటని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రజల మన్ననలను పొంది, సౌమ్యుడుగా ఆసీఫ్ పేరు పొందారన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అయనతో పాటు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకులు జమాల్‌ఖాన్, మాజీ జడ్‌పి కో-ఆప్షన్ సభ్యులు అలీ నవాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మదనపల్లె పరిశీలకులు హాబీబుల్లా ఖాన్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్, పార్టీ పట్టణ అధ్యక్షులు రియాజుర్ రెహమాన్, డిసిసిబి డైరెక్టర్ సేర్ వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ బిసి సెల్ కన్వీనర్ నాగరాజు యాదవ్, నాయకులు నివాళులు అర్పించారు.

రసీదు లేని రూ.14 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని అనుపల్లి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో రూ.14 లక్షలు నగదును పశువుల పెంపకందారుల నుంచి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వీరు నెల్లూరు జిల్లా గూడూరులో ప్రతి శుక్రవారం జరిగే పశువుల సంతలో రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంత రైతులు తాము పెంచుకుంటున్న మేకలు, గొర్రెలను అమ్ముకుని వస్తున్నారు. సంతలో గొర్రెలు అమ్మి వారిచ్చిన సొమ్ముతో మిగిలిన పశువులతో తిరిగి వస్తూ ఉండగా అనుపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. రైతులు ఎంతగా విన్నవించుకున్నా పట్టించుకోకుండా రాత్రి వరకు వాహనాలు అదుపులో ఉంచుకోవడంతో విలువైన రెండు గొర్రెలు చనిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీలో జమ చేస్తామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

మాట్లాడుతున్న ఎన్నికల సహాయ అధికారి మహబూబ్ బాషా

ఆర్ఒ అనుమతితోనే ప్రచార సామగ్రి ముద్రించాలి

ప్రజాశక్తి-పీలేరు

ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రణకు ఆర్ఒ అనుమతి, ఆమోదం తప్పనిసరి అని పీలేరు సహాయ ఎన్నికల అధికారి మహబూబ్ బాష, ఎంసిసి అధికారి ఉపేంద్రరెడ్డి తెలిపారు. పీలేరు నియోజకవర్గం ఎన్నికల అధికారి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో పట్టణ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులకు వారు అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రాతిపదిక చట్టం 127ఎ అనుసరించి రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి వినియోగించే ప్రచార సామాగ్రిని ముద్రించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ముద్రణాలయ నిర్వాహకులు తమకు వచ్చిన ఆర్డరుతో పాటు ఆర్ఒ అనుమతి పత్రం కూడా ఉందా లేదా అన్న విషయాన్ని పరిశీలించుకోవలసి ఉంటుందని చెప్పారు. వాటిని ముద్రించే ముందు సిద్ధం చేసిన ప్రూఫ్‌ను ఆర్ఒకు సమర్పించి, ఆ తర్వాతి ఆమోదం పొందాకే ముద్రించాలని, వాటిపై ముద్రించిన కాపీల సంఖ్య, ముద్రణాలయం పేరు కూడా విధిగా ఉండాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దారులు ప్రదీప్, సుబ్రమణ్యం, కిరణ్, ముద్రణాలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పోలీసులకు కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి శుక్రవారం కంటి అద్దాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శనంగా తీసుకోవలని శ్రీ సాయి కంటి ఆసుపత్రి అధినేత శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎండలు ఎక్కువ ఉండడంతో బ్లూకోర్ట్ పోలీసు సిబ్బందికి కూలింగ్ అద్దాలు అందజేయడం సంతోషమరని పేర్కొన్నారు. అనంతరం శ్రీసాయి కంటి ఆసుపత్రి ప్రొప్రైటర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు ఎండ తీవ్రత జరుగుతున్నందున రాయచోటిలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బ్లూకోర్ట్ పోలీసులు నిరంతరం ఎండలో తిరుగుతున్నందున వాళ్లకు నా వంతుగా కూలింగ్ అద్దాలు ఇచ్చానని పేర్కొన్నారు. రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవ కార్యక్రమాలు చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్, లయన్ నాగార్జున ఆచారి, కోశాధికారి లయన్ హరీష్ చంద్ర, లయన్ శివారెడ్డి, లయన్ రత్నమాచారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కంటి అద్దాలు అందజేస్తున్న సిఐ సుధాకర్‌రెడ్డి

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-మదనపల్లి

సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి విభిన్నప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, 60 ఏళ్ల పైబడిన వారిని మినహాయించాలని కలెక్టర్‌ను కోరుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబిర్, మదనపల్లి అధ్యక్షులు గాలి రవీంద్ర, కార్యదర్శి మల్లేశ్వర బాబు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించే కేంద్రాలలో హాజరయ్యే వారికి భోజన సదుపాయం, సౌకర్యాలు కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగినులకు ఎన్నికల విధులు దగ్గరలో కేటాయించాలని తెలిపారు. పురుషులకు వారు పనిచేస్తున్న పక్క నియోజకవర్గంలో విధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. క్యాడర్, సీనియారిటీ ప్రకారం విధులు కేటాయించాలని కోరారు. ఎన్నికల శిక్షణ కేంద్రాల వద్దనే పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. నిబంధనల మేరకు రెమ్యునరేషన్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

కుప్పంలో టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - చక్రాయపేట : పులివెందుల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బిటెక్ రవి సోదరుడు జోగిరెడ్డి, మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కుప్పం పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారికి మహిళలు హారతి పళ్లెంతో స్వాగతం పలికారు. కుప్పం పంచాయతీలోని కొండుగారి పల్లె బలిజ పల్లె, వడ్డేపల్లి, హరిజనవాడ, కుప్పం గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం చేశారు. ఒక్కసారి అన్నకు ఓటు వేసి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తారని సోదరుడు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

టిడిపికి ఓటు వేస్తే బిజెపికి వేసినట్లే : ఎంపీ

ప్రజాశక్తి-మదనపల్లి

టిడిపికి ఓటువేస్తే బిజెపికి వేసినట్లే అనేది మైనార్టీలు గుర్తు పెట్టుకోవాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. మదనపల్లి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువ వద్దే పడుకున్న చంద్ర బాబు కుప్పానికి హంద్రీ నీవా నీళ్లు తీసుకురాలేక పోయారు. తాము కుప్పానికి నీళ్లు నీసుకొచ్చామని గుర్తుచేశారు. రాబోవు రోజుల్లో మదనపల్లి, తంబళ్లపల్లి, పుంగనూరు, కుప్పం వరకు కాలువ వెడల్పు చేసి గాలేరు పథకంతో శాశ్వితంగా తాగు, సాగు నీరు అందిస్తామని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి మాట కొస్తే మదనపల్లెల్లో మెడికల్ కాలేజీ, యూనివర్సిటీ తీసుకురావడం, రోడ్లు వేయడం, నేషనల్ హైవే తీసుకొచ్చి పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. స్వాతంత్ర్యం తర్వాత ఇంత పెద్దఎత్తున అభివృద్ధి జరగడం జగన్ సహకారమేనని తెలిపారు. తంబళ్లపల్లి, పుంగనూరు రిజర్వాయర్లు తీసుకొచ్చామన్నారు. హౌసింగ్, సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందజేశామని చెప్పారు. టిడిపి హయంలో ఐదేళ్లలో ఐదు రోడ్లు వేసిన పాపాన పోలేదన్నారు. చంద్రబాబు కల్లిబుల్లి మాటలు చెబుతున్నారని, బిజెపికి ఓటేస్తే మైనార్టీలకు అన్యాయం అవుతుందని చంద్రబాబు నోటితోనే చెప్పడం ఈరోజు సోషల్ మీడియాలో ఉన్నాయి అన్నారు. ఆయనే 2014లో బీజేపీ పొత్తులో ఉండి కూడా మైనార్టీలకు ఒక చీటిచ్చి అదికూడా అపోజిట్ వాళ్లకు సపోర్టు చేశారన్నారు. ఇప్పుడు కూడా చంద్రబాబు అదే దారిలో వెళుతున్నాడు, ఆయన జిమ్మిక్కులు మైనార్టీ నమ్మొద్దన్నారు. తెలుగు దేశం పార్టీకి ఓట్లు వేస్తే బిజెపికి ఓటు వేసినట్టే అనేది మైనార్టీ సోదరులు గుర్తు పెట్టుకోవాలని కోరారు. ఆలయన్స్‌లో ఉండే పార్టీలు రేపు యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లు ప్రవేశపెడ తామని బిజెపి వాళ్ళు చెప్పారు. అదే పరిస్థితి జరిగితే రేపు కచ్చితంగా టిడిపి పోటీ చేస్తుందన్నారు. అప్పుడు బిల్లుకు వైసిపి వ్యతిరేకంగా ఓటేస్తుందన్నారు. పొరపాటున టిడిపికి ఓటు వేస్తే మైనార్టీలకు వ్యతిరేకంగా వచ్చే అన్ని బిల్లులకు ఓటు వేసినట్లేనని గుర్తు పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏప్రిల్ 2వ తేదీన మదనపల్లి పట్టణంలో మేమంతా సిద్ధం బహిరంగ సభ మైదానం, పార్కింగ్ స్థలం పరిశీలించిన ఎంపీ మిథున్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, సిఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురామ్, మదనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

జాతీయ స్థాయి ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న వైస్ ప్రిన్సిపల్, విద్యార్థులు

జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అశ్వ-2024 జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి ఏటా కళాశాలలో నిర్వహించే ఈ ఫెస్ట్‌లో విద్యార్థులకు వివిధ పోటీలను టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ విభాగాలలో నిర్వహిస్తామని, ఈ సంవత్సరం ఏప్రిల్ 25, 26వ తేదీలలో రెండు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహిస్తామని కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని, వివరాలు కళాశాల వెబ్‌సైట్ www.mits.ac.inలో పొందుపరిచామని పేర్కొన్నారు. ఈ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు, పోటీలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని, సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రతి ఏటా సినీ ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అలరిస్తారని, ఈ సంవత్సరం కూడా సినీ తారలు పాల్గొంటారని పేర్కొన్నారు. కళాశాల అశ్వ 2024 కన్వీనర్, వైస్ ప్రిన్సిపల్ కమాల్ బాషా అశ్వ 2024 వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతిలేని వైసిపి ప్రచార కరపత్రాలు సీజ్

ప్రజాశక్తి-పీలేరు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఎన్నికల ప్రచార కరపత్రాలను సీజ్ చేసినట్లు సహాయ ఎన్నికల అధికారి మహబూబ్ బాష, ఎంసిసి అధికారి ఉపేంద్రరెడ్డి తెలిపారు. శుక్రవారం తమకు అందిన ఫిర్యాదు మేరకు తాము ప్రచార కార్యక్రమాన్ని తనిఖీ చేశామని అన్నారు. సదరు ప్రచార బృందానికి ఇంటింటి ప్రచార అనుమతులు ఉన్నప్పటికీ వారు పంపిణీ చేస్తున్న కరపత్రాల వినియోగానికి అనుమతులు లేకపోవడంతో వారి నుంచి 204 కరపత్రాలను సీజ్ చేసి, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అనుమతి లేకుండా కరపత్రాలను పంపిణీ చేసినందుకు సదరు వైకాపా నాయకుడికి నోటీసు జారీ చేసి, రూ.2 వేలు అపరాధం విధించినట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు విధిగా ఎన్నికల కార్యక్రమాలకు అవసరమైన అన్ని అను మతులు పొందాలని, వీటిని జారీ చేయడానికి పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇతర అనుబంధ అధికారులు స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. అంతే కాకుండా సువిధ యాప్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న 48 గంట్ల వున్నా దరఖాస్తు చేసు కున్న వెనువెంటనే అనుమతులు జారీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలియజేసారు.

'పైడిపాలెం'లో 4.45 టిఎంసిల నీరు నిల్వ

ప్రజాశక్తి - సింహాద్రిపురం : మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్‌లో 4.45 టిఎంసిల నీరు నిల్వ ఉన్నాయని గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ డిఇ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు సామర్థ్యం 6 టిఎంసిలు కాగా ఇప్పటివరకు రైతుల అవసరాల దృష్ట్యా హిమకుంట్ల , మల్లెల కాలువల ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం100 క్యూసెక్కుల నీరు మల్లెల కాలువ ద్వారా చెరువులకు నింపేందుకు విడుదల చేశామని తెలిపారు. రైతుల అవసరాల దృష్ట్యా హిమకుంట్ల కాల్వకు, మల్లెల కాల్వకు అదనంగా నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ శనివారం (సా)	షహారీ ఆదివారం (ఉ)
6.30	4.58

ఇంటింటి ప్రచారంలో కరపత్రాలు పంచుతున్న వైసిపి నాయకులు

వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని నవాబ్‌పేట పంచాయతీలోని నవాబుపేట, చావిడ కాడపల్లి, దళితవాడ, గొల్లపల్లి, మండెంవారిపల్లిలో మాజీ జడ్‌పిటిసి చింతల శివానందరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. మరల వైసిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు మరోమారు ఆదరించాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజా, నడిపి చెర్ల వైసిపి నాయకులు నరసింహారెడ్డి, బాబురెడ్డి, ఆర్‌బికె చైర్మన్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

భాస్కరరావును సన్మానిస్తున్న జనసేన నాయకులు

జనసేన గెలుపునకు సహకరించండి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని పుల్లంపేట, రైల్వేకోడూరు మండలాల ప్రముఖులతో శుక్రవారం జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఎనమల భాస్కరరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తనను గెలిపిస్తే నియోజకవర్గ సర్వతో మఖాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పివిఎస్ మూర్తి, గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ, బలిజసేన జిల్లా అధ్యక్షుడు నరసింహ, డాక్టర్ తోటరామయ్య, కొమ్మ శివ,గోపాల్, ఈశ్వరయ్య, సునీల్, నరేష్, సుబ్బనరసయ్య పాల్గొన్నారు.

వైసిపిలో చేరుతున్న ముస్లిము మైనార్టీలు

వైసిపిలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండల కేంద్రంలోని హేమాచారి కల్యాణ మండపంలో రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గం శాసనసభలు చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో జెఎసి వ్యవస్థాపకుడు హనీఫ్ ఆధ్వర్యంలో ముస్లిము మైనార్టీకి చెందిన 50 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ముస్లిం సోదరులకు పెద్దపెట్ట వేసిందని, రాబోవు కాలంలో కూడా అన్ని విధాల ముస్లిం సోదరులు ఆదుకుంటారని అన్నారు. అభివృద్ధిని పథకాల అమలవుతున్న తీరును చూసి ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేసే నాయ కుడు జగన్ అని సదుద్దేశంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ, లోకవర్ధన్, మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ద్రౌపది కల్యాణం

ప్రజాశక్తి-కలకడ

ద్రౌపది కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు రామయ్య, వెంకటరమణ నాయుడులు తెలిపారు.మండలంలోని దేవళంపేటలో శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం ద్రౌపది పంచ పాండవుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రాల మధ్య మేళతాళాలతో నిర్వహించిన కల్యాణాన్ని భక్తులు వీక్షించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ క్రిష్ణమూర్తి

తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలో ఈ వేసవి కారణంగా గ్రామాలలో తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి ఆదేశించారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. బోరు మోటర్లు, స్టార్టర్‌లో ఎక్కడైనా మరమ్మతులకు గురైన వెంటనే స్పందించాలని తెలిపారు. ఎక్కడా సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ అశోక్‌లు పాల్గొన్నారు.

'రిమ్స్'లో అన్నదానం

కడప అర్బన్ : ఏటూరి లక్షుమమ్మ ఛారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ (రిమ్స్) వద్ద శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 15వ డివిజన్ చెర్లోపల్లి గ్రామం లోని ఏటూరి లక్షుమ్మ 3వ వర్ధంతి సందర్భంగా ఏటూరి లక్షుమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మంది పేదలకు అన్నదాన చేసి నట్లు ఏటూరి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటూరి నరసింహారెడ్డి, చంద్రారెడ్డి, పెంచల్‌రెడ్డి , మనవళ్లు, బంధువులు పాల్గొన్నారు

సవరణ

తేదీ.28-03-2024న ప్రచురితమైన Medarasatri Raju Documents missing యాడ్ నందు sale deed number 4733/1977 అని పొరపాటున ప్రచురితమైనది. కావున saledeed No.4743/1977గా చదువుకొనవల్సినదిగా మనవి చేస్తున్నాను.

ఇట్లు

Medarasatri Raju
Bamboobazar
Madanapalli.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఎంపీ

ప్రజాశక్తి-కలికిరి

గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల కేంద్రంలోని హేమాచారి కల్యాణ మండపంలో కలికిరి మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 14 గ్రామ పంచాయతీ పరిధిలోని కార్యకర్తలను నాయకులను పిలిపించి గ్రామాలకు చెందిన కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి వివరించి గెలుపే లక్ష్యంగా పెట్టుకుని ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని కోరారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు జామియా మసీదులో నమాజ్‌కు వెళ్లి ముస్లిం మైనార్టీ నాయకులతో ప్రార్ధనలు నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆగాముద్దీన్, పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజా లోకవర్ధన్, సీనియర్ నాయకుడు నల్లారి తిమ్మారెడ్డి, జిల్లా ఎస్‌సిసెల్ కార్యదర్శి వి.హరి, సీనియర్ నాయకులు రాహుల్ చక్రవర్తిరెడ్డి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, సురేందర్ రెడ్డి, గంగయ్య, తస్లీమా రియాజ్, ఎంపిటిసి బోగేష్, వైస్ ఎంపిపి శ్రీకాంత్ యాదవ్, కో-ఆప్షన్ మెంబర్ రిజ్వాన్, అజయ్, ఖాదర్, జెఎసి వ్యవస్థాపకుడు హనీఫ్, వెంకటపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

రైల్వేకోడూరు : కేక్ కట్ చేస్తున్న ముక్కా సాయివికాస్‌రెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని మూడు రోడ్ల కూడలి బస్టాండ్ సర్కిల్‌లో తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తంబళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి దాసరపల్లి జయచంద్రారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధ, జనసేన తంబళ్లపల్లి ఇంచార్జ్ పోతుల సాయినాథ్, టిడిపి రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామినాయుడు, కువైట్ శంకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కె.వి రమణలు పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడ టిడిపి కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండలంలోని టిడిపి కార్యకర్తలు, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అభిమానులు, మైనార్టీ సోదరులు ఘనంగా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మైనారిటీ సోదరులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.**గుర్రంకొండ :** బిసిల అభివృద్ధి కొరకే ఎన్‌టి.రామారావు తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందని మండల టిడిపి అధ్యక్షుడు నాయిని జగదీష్ అన్నారు. టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో టిడిపి నాయకులు, నల్లారి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాఘవరాజుపురం పంచాయతీ పరిధిలోని టిడిపి కార్యాలయంలో సాయివికాస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో కోడూరు మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్‌గౌడ్, కట్టా గుండయ్యానాయుడు, వాసుదేవరెడ్డి, మైనారిటీ నాయకులు బాబాసాహెబ్, కట్టా బాలాజీ, టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, బోక్కసం సునీల్, అనిత దీప్తి, వేణుగోపాల్ రెడ్డి, కొప్పరపు అరవింద్, గౌతమ్ రాజు, తిప్పన రాజశేఖర్, పసుపులేటి చంద్ర, రెడ్డి బాబు, రాజశేఖర్ రాజు, సూర్య ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు. **కలికిరి:** మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ జడ్‌పిటిసిలు మాలతి, రహమతుల్లా, మాజీ సర్పంచ్లు అంజమ్మ, బి వెంకటరమణ, మాజీ ఎంపిటిసి జనార్దన్ గౌడ్, యతేంద్ర యాదవ్, నాయకులు బయన్న, తిప్పారెడ్డి, రత్న, వెంకటరమణ పాల్గొ న్నారు. **చిట్వేలి:** టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అడ్వకేట్ బాలాజీ, జనరల్ సెక్రెటరీ అనంత యాదవ్, శ్రీధర్‌నాయుడు, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రవీణ్, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు గుండాలయ్య యాదవ్, రామ చంద్ర యాదవ్, రవిరాజు, రాయపు వెంకట సుబ్బయ్య, చంద్రమౌళి వెంకటేష్, ఎల్లయ్య, పగడాల వెంకటేష్, పెంచల్ రెడ్డి ,పురం రమణయ్య, హరినాథ్‌రెడ్డి, రమణయాదవ్ పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మండల తెలుగు యువత అధ్యక్షులు నారా గంగాధర్ ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల ఎంపిడిఒ వెంకటరమణయ్య ద్వారా ఇసి నిబంధనల మేరకు వేడుకలు నిర్వహించామని చెప్పారు. కార్యక్ర మంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి : సిఐ

ప్రజాశక్తి-నందలూరు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని ప్రజలందరూ స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రాజంపేట రూరల్ సిఐ మంజునాథరెడ్డి పేర్కొన్నారు. ఎస్‌పి కృష్ణారావు, రాజంపేట డి ఎస్‌పి చైతన్య ఆదేశాల మేరకు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బలగాలతో టంగుటూరు, పొత్తపి గ్రామాలలో కవాతు నిర్వహిం చారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి అందరూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. మండలంలో ఎటువంటి ఘర్షణలు జరిగిన కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. సార్వ త్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలకు విఘాతం కలుగ కుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా ప్రజలకు భద్రత కల్పించడానికి పోలీసు కవాతు నిర్వహించినట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.**రామాపురం :** 2024 మేలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండడానికి ఉన్నతాధికారి ఆదేశం మేరకు 60 మంది కేంద్ర బలగాలతో మండల కేంద్రంలో లక్కిరెడ్డిపల్లె సిఐ గంగాధర్‌బాబు, రామాపురం ఎస్‌ఐ ఎల్‌వి. ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మండలంలో సమ స్యాత్మకమైన గ్రామాలైన ఎర్రంరెడ్డిగారిపల్లి, కల్పనాయిచెరువు, భయ్యారెడ్డిగారి పల్లి, కొత్తపల్లిలో పోలీస్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాల వెళ్లి నిర్భయంగా ఓటు హక్కు విని యోగించుకోవచ్చని తెలిపారు.

నందలూరు : కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వైసిపితోనే ముస్లిం మైనార్టీలకు భవిష్యత్తు

మాట్లాడుతున్న పాగొండ ఖలీల్ అహ్మద్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపితోనే ముస్లిం మైనార్టీలకు భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని అన్నమయ్య జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం బి.కొత్తకోటలో పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేకనే జనసేన, బిజెపితో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. ఎన్‌ఆర్‌సి, సిఎఎ బిల్లుల నుంచి ముస్లిములకు రక్షణ కల్పిస్తానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితుల్లో ముస్లిము మైనార్టీలు లేరని అన్నారు. మే 13న జరుగబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని, రాజంపేట పార్లమెంటు సభ్యులుగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను మరోమారు గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి డి.రియాసత్ అలీ ఖాన్, పిటిఎం ఎంపిపి మహమ్మద్, నాయకులు ఫజుల్ అలీ, కురబలకోట ఎంపిపి దస్తగిరి, వైసిపి స్టేట్ మైనారిటీ సెక్రటరీ ఎన్‌జిఒ మెంబర్‌మాలిక్ ఖాద్రి, వైసిపి ప్రచార కార్యదర్శి, అయూబ్ బాషా, మాజీ కో-ఆప్షన్ మెంబర్ అమీర్‌బాషా, గుమ్మడికాయల చాంద్ బాషా పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ నాగసుబ్బరాయుడు

పాఠశాలలో ఎంఇఒ తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్యమడుగు ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ నాగ సుబ్బరాయుడు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పిల్లల హాజరు, బోధనతీరు, తదితర అంశాలపై హెచ్‌ఎం వెంకట్రమణను అడిగి తెలుసు కున్నారు. పిల్లల అభ్యసనా స్థాయిని గుర్తించేందుకు ప్రశ్నించారు. పిల్లలు సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉన్నత పాఠశాల మధ్యాహ్నం భోజన పథకం అమలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించండి

ప్రజాశక్తి -కడప అర్బన్

దేశావ్యాప్తంగా నిర్వహించబోయే సార్వత్రిక ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించాలని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జూపల్లి జానకిరాములు ప్రజలను కోరారు. నగరంలోని రాయలసీమ జోన్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సుబ్బారాయుడు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరాములు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదులు అరాచకాలు ఎక్కువ అయ్యాయని పేర్కొన్నారు. వాటిని ఎదుర్కోవాలంటే వామపక్ష పార్టీలు ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. బాండ్లతో కోట్లు రూపాయలు సొమ్ముచేసుకున్న బిజెపిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పౌర సత్వ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాదులకు బుద్ధి రావాలంటే రానున్న ఎన్నికల్లో బిజెపిని గద్దె దించి ఇండియా కూటమిని అధికారంలోకి తేవాలన్నారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆర్‌ఎస్‌పి అభ్యర్థులను ప్రకటించారు. సమావేశంలో ఆర్‌ఎస్‌పి నాయకులు కృష్ణవేణి, తిమ్మాక్క నరసింహ రావు, భాస్కర్, నరేంద్ర, నంద కిషోర్ పాల్గొన్నారు.

మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తాం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

పంటల మద్దతు ధరలకు చట్టపద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు గోగుల రమేష్, తిరుపాల్ రెడ్డి, శివ, బ్రహ్మం లో తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తమ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో ప్రత్యేక మేనిఫెస్టో ఉంటుందన్నారు. మేనిఫెస్టో ప్రకారం ప్రతి ఏటా పేద మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సాయం చేస్తారన్నారు. పంట నష్టం జరిగిన నెల రోజులలోపే రైతులకు పరిహారం చెల్లిస్తారన్నారు. కార్మికులకు ఆరోగ్య హక్కు చట్టం అమలు చేస్తారన్నారు. రైతులకు రూ.3 లక్షల వరకు రుణమాఫీ ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేకహోదా, పోలవరం, రాజధాని నిర్మాణ బాధ్యత, కడపకు సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో వివరాలను గడపగడపకు తెలియ జేస్తున్నామన్నారు.

వైసిపికి 'కొనిరెడ్డి' రాజీనామా

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కొత్తపల్లి సర్పంచ్ వైసిపి నాయకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని వైసిపి జిల్లా అధ్యక్షుడు మేయర్ సురేష్‌బాబుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కొనిరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఎంఎల్‌ఏ రాచమల్లు ప్రసాదరెడ్డి దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని, ఈ పాలనను సహించలేక, ఆ పార్టీలో తాను ఇమడలేక తాను రాజీనామా సమర్పించానని తెలిపారు.

లక్కిరెడ్డిపల్లెలో శిలువ మోస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న వేషధారి

క్రీస్తు త్యాగానికి ప్రతీక 'గుడ్ ఫ్రైడే'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

యేసుక్రీస్తు మహా త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే జరుపుకుంటామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. జగతికి శాంతి సందేశమిస్తూ ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. శత్రువులను కూడా ప్రేమతో క్షమించాలని చెప్పిన దయామయుడని అన్నారు. సాటివారి పట్ల ప్రేమ, అవధులు లేని త్యాగం క్రీస్తు మానవాళికి ఇచ్చిన సందేశమని అన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి, లూథరన్ చర్చి, మిస్పా చర్చి, మద్దిరేవుల చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చిలో రెవరెండ్ ఫాదర్ విజయ్ మోహన్ రెడ్డి ఏసుక్రీస్తు జీవిత చరిత్ర ఆయన ప్రజల కోసం సిలువ మోసిన త్యాగం గురించి వివరించారు.ఈ నెల అంతా ఉపవాసాలు చేసిన క్రైస్తవ సోదరులు ఈరోజుటితో ప్రార్థనలు చేసి ఉపవాసం వదలు తారని చెప్పారు. ప్రార్థనలు చేసి ఉపవాసం ఉన్న క్రైస్తవ విశ్వాసులకు ,భక్తులకు అన్నదానం నిర్వహించారు. **తంబళ్లపల్లి :** మండలంలోని తంబళ్లపల్లె సిఎస్‌ఐ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మదనపల్లి జెసిఎం చర్చ్ నుంచి వచ్చి దైవ సేవకులు బహదూర్ సింగ్, దిన కుమార్, ఎలీ షాలు ఏసుక్రీస్తును పలికిన ఏడు మాటలను బోధించారు. ప్రార్థనల్లో ఎస్తేరమ్మ, చంద్రమ్మ, గీత, సుజాత, దేవ శిఖామణి, జాషువా,చిట్టిబాబు, విమలమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

మురుగునీటితో నిండివున్న పాఠశాల ప్రహరీ

మురుగునీటి సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలోని ఉర్దూ పాఠశాల ప్రధాన ప్రహరీ గేట్‌లో నిత్యం చుట్టూ పరిసరాల నుంచి వచ్చే మురుగునీరు ప్రవహిస్తుంది. విద్యార్థులు పాఠశాలల్లోకి రావడానికి ఇబ్బందిగా ఉందని అధికారులు సమస్య పరిష్కరించి మురుగునీటి పారుదల లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి అంబేద్కర్ గురుకుల పాఠశాలకు వెళ్లుదారి అధ్వాన్నంగా ఉందని తెలిపారు. మురుగునీటిపై దోమలు విజృంభిస్తుండటంతో విషజ్వరాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. పాఠశాలకు విద్యార్థులను పంపించాలంటే రోగాల బారిన పడతారని తల్లిదండ్రులు భయాందోళన చెందుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డును తలపి స్తున్న వ్యర్థాలను తొలగించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ఖాజీపేట : అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, ప్రజలు అందరూ టిడిపికి పట్టం కట్టాలని మైదుకూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బి. కొత్త పల్లె గ్రామంలో సింగల్ విండో మాజీ అధ్యక్షులు ముత్తూరు రఘురామి రెడ్డి వర్గీయులు టిడిపిలో చేరారు. పుట్టా సుధాకర్ యాదవ్ వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకుంటేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి మల్లోత్రా, టిడిపి మండలం అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, సీనియర్ నాయకులు సందుల నాగ శివారెడ్డి, కూనవారిపల్లె సుబ్బిరెడ్డి, జెండాల మహబూబ్ బాషా, తవ్వా సుబ్బారెడ్డి, సుబ్బారామిరెడ్డి, ఎంపిటిసి చంద్ర భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

300 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా తయారీ స్థావరాలపై నిమ్మనపల్లి పోలీసులు, ఎస్‌ఎస్‌బి పోలీసులు ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పారేసువారిపల్లె, చల్లావారిపల్లెలో, పరిసర ప్రాంతాలలో ముమ్మరంగా నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో నాటుసారా తయారీ స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి సారా తయారీ, రవాణా, విక్రయాలపై ఉక్కు పాదం మోపుతున్నామని అన్నారు. అసాంఘిక శక్తుల అణ చివేతే తమలక్ష్యమని తెలిపారు. శుక్రవారం ముష్టూరు గ్రామంలోని పారేసు వారిపల్లె, చల్లావారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతాలలో ఎస్‌ఎస్‌బి పోలీస్ సిబ్బంది, స్థానిక పోలీసులు కార్డెన్ సెర్చ్ తనిఖీలను చేపట్టినట్లు వివరించారు. విస్తృత తనిఖీలలో భాగంగా నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 300లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. మండలంలో అసాంఘిక శక్తుల పైన, నాటుసారా తయారీకి పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపుతున్నట్లు తెలిపారు. సారా తయారీకి పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పదేపదే నాటు సారా కేసుల్లో పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ కేసులను సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా అసాం ఘిక కార్యకలాపాలు జరుగుతుంటే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌బి పోలీస్‌సిబ్బంది, స్థానిక పోలీసులు రాజేష్, హరినాథ్ పాల్గొన్నారు. **కలకడ:** నాటు సారా స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.మండలంలోని దిగువ తాండ పంచాయతీ ఎగుతాండ గ్రామంలో మూడే చలపతి నాయక్ ఇంటి వెనుక ఉన్న మారెమ్మ గుడి రెండు తెల్లని సంచులను నాటుసారా కలిగి ఉండటంతో దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సంచులలో దాచిన రూ.6వేలు విలువ చేసే 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని ఓ కళాశాల విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ తెలిపారు. సిఐ వివరాల మేరకు..పట్టణంలోని వాయిలవంకలో నివాసముండే చిన్న నారాయణ కుమారుడు జి.రమణ గత కొద్దిరోజులుగా కళాశాల విద్యార్థినిని వేధిస్తూ, అసభ్యకరంగా వ్యవహరించేవాడని అన్నారు. సదరు విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిందితుడు రమణను రంగసముద్రం రోడ్డు, పాత ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అతనిని అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రిమాండ్ నిమిత్తం మదనపల్లి కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.